www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 29 ఏప్రిల్ 2025

అక్రమ గ్రావెల్ తవ్వకంపై చర్యలు తీసుకోవాలి

సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: నగరి రూరల్ మండలం, గుండ్రాజు కుప్పం దళితవాడకి ఆనుకుని ఉన్న గుట్టలో అక్రమంగా గ్రావెల్ తీస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ పరిమితికి మించి గ్రావెల్ తీయడంతో భూగర్భ జలాలు అట్టడుగు స్థాయికి పోయిందని, తరచూ క్వారీలో బాంబులు పేల్చడం వలన దళితవాడలోని చాలా ఇండ్లకు పగుళ్లు ఏర్పడ్డాయని, కొన్ని ఇళ్లలో పెచ్చులూడి పడుతున్నాయని, గ్రావెల్ దుమ్ము పరిసరాల్లో చేరిపోవడంతో పశువులకు మేత కూడా లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రింబవళ్లు తేడా లేకుండా మిషన్లతో గ్రావెల్ త్వవేస్తున్నారని ఇలానే కొనసాగితే ఆ గుట్ట ఆనవాళు కూడా లేకుండా పోతుందని అన్నారు. గతంలో ఎన్నోసార్లు ఫిర్యాదు చేసినా గనుల శాఖ, రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. తహశీల్దార్ గ్రావెల్ క్వారీ అనుమతులు రద్దుచేసి పరిమితికి మించిన అక్రమ గ్రావెల్ తవ్వకాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు.

ఉపాధిని నిర్వీర్యం చేయకండి

- కూలీలకు బకాయి బిల్లులు వెంటనే చెల్లించాలి
- వ్యకాసం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు

ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న దడాల సుబ్బారావు, గంగరాజు

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయకుండా కాపాడుకుందామని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని తగ్గువారిపల్లి పంచాయతీలో జరుగుతున్న ఉపాధి హామీ పనులలో కూలీలతో ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ చట్టం పేదరికంలో ఉన్న వారికి ఒక వరమని, గత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎన్నో పోరాటాలు చేసి సాధించిన ఉపాధి హామీ చట్టంలోని పలు అంశాలను కేంద్ర ప్రభుత్వం తుంగలో తొక్కుతున్నారని, ఈ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు పేదల కడుపు కొట్టేందుకు అగ్రవర్ణాలకు కొమ్ముకాస్తున్నదని విమర్శించారు. ఉపాధి హామీ వలన పేదలు 100 రోజులు పని దినాలు చేసి కొద్దోగొప్పో కుటుంబ అవసరాలు తీర్చుకుంటున్నారని, ఈ పని దినాలను 200 రోజులకు పెంచాలని, అలాగే ఒకరోజు వేతనం రూ.600లు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గట్టిగా పోరాడుతున్నదని తెలియజేశారు. అలాగే పనిచేసిన 15 రోజులకు వేతనాలు చెల్లించాలని లేనిపక్షంలో 0.2 శాతంతో వడ్డీతో చెల్లించాలని డిమాండ్ చేశారు. 2012 తర్వాత పనిముట్లు ఇవ్వడం లేదని ఉపాధి పని కావాలని దరఖాస్తు చేసుకున్న 15 రోజుల్లో పని కల్పించాలని లేకుంటే కోర్టులో కేసు నమోదు చేసి నిరుద్యోగ భృతి అందించే విధంగా చూడాలని అన్నారు. పని ప్రదేశంలో నీడకు షామినాలు, తాగడానికి నీరు వేసవిలో అదనపుగా నగదును చెల్లించాలని కోరారు. ఉపాధి కూలీలు సహకరించి ఉపాధి హక్కులను కాపాడాలని మే నెల 20వ తేదీ జరుగు సమ్మెలో ప్రతి ఒక్కరు పాల్గొనాలని పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు మాట్లాడుతూ ఉపాధి చట్టంలోని అంశాలను ప్రతి ఒక్కరు అవగాహన చేసుకుని మరింత మెరుగైన సంపాదన సంపాదించుకోవచ్చు అన్నారు. మే ఒకటి నుండి అమలు చేసే ఇన్సూరెన్స్ పథకాన్ని ఉచితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. జాబ్ కార్డు ఉన్న వారందరికీ అమలయ్యే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. చట్టంలో ఉన్న విధంగా ఒంటరి మహిళలకు, వికలాంగులకు అదనపు సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా ఈ పథకాన్ని బలోపేతం చేయడానికి బడ్జెట్లో అదనపు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఉపాధి హామీ కూలీల సమస్యలపై దశలవారీ పోరాటాలు చేపడుతామని తెలిపారు. జిల్లా రైతు సంఘ కార్యదర్శి శంకరన్, ఉపాధి కూలీలు చోటిమాబి, కాంచన, కళ, విమల, రెడ్డమ్మ, సుధా, ప్రభాకర్ పాల్గొన్నారు.

ముగిసిన కుప్పం మున్సిపల్ పోరు

అధ్యక్ష పీఠాన్ని అధిరోహించిన సెల్వరాజు
పట్టణమంతా టిడిపి సంబరాలు

ప్రజాశక్తి- కుప్పం టౌన్

కుప్పం పురపాలక సంఘం అధ్యక్ష పదవి 5వ వార్డు అభ్యర్థి సెల్వరాజును వరించింది. సోమవారం ఉదయం పట్టణంలోని మండల అభివృద్ధి కార్యాలయ సమావేశ మందిరంలో ఆర్‌డిఓ శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో పురపాలక సంఘం అధ్యక్ష పదవికి ఉపఎన్నిక నిర్వహించారు. పట్టణంలో ఉన్న 24 మంది కౌన్సిలర్లలో 22 మంది హాజరు కాగా, ప్రజాప్రతినిధుల కోటాలో ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఎమ్మెల్సీ భరత్ ఓటర్లుగా పాల్గొన్నారు. టిడిపి తరపున అధ్యక్ష అభ్యర్థిగా సెల్వరాజు పేరును 19వ వార్డు కౌన్సిలర్ జిమ్ దాము ప్రతిపాదించగా, 20వ వార్డు కౌన్సిలర్ సోమశేఖర్ బలపరచడం జరిగింది. వైసీపీ తరపున 9వ వార్డు కౌన్సిలర్ హఫీజ్ పేరును 2వ వార్డు కౌన్సిలర్ మునిరాజు ప్రతిపాదించగా, 7వ వార్డు కౌన్సిలర్ నాగరాజు బలపరచారు. అనంతరం జరిగిన ఓటింగ్ ప్రక్రియలో మొత్తం 24 మంది ఓటర్లు ఉండగా అందులో 9 మంది వైసీపీ అభ్యర్థికి ఓటు వేయగా, 15 మంది టిడిపి అభ్యర్థికి ఓటు వేయడం జరిగింది. టిడిపి అభ్యర్థికి ఎక్కువ మెజారిటీ రావడంతో సెల్వరాజును పురపాలక సంఘం నూతన అధ్యక్షులుగా ఎన్నికల అధికారి ప్రకటిస్తూ తూర్పు రాయలసీమ పట్టభద్రుల శాసనమండలి సభ్యుల సమక్షంలో ఆర్‌డిఓ శ్రీనివాసరాజు ధ్రువపత్రాన్ని అందజేశారు. టిడిపి అభ్యర్థి గెలుపొందడంతో తెలుగు తమ్ముళ్లు పెద్ద ఎత్తున సంబరాలు జరుపుకున్నారు. ఈసందర్భంగా పెద్దఎత్తున ర్యాలీగా నిర్వహించి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పురపాలక సంఘం కౌన్సిలర్లు, ఎమ్మెల్సీ, ఏపీఎస్ ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్.మునిరత్నం, రాష్ట్ర టిడిపి కార్య నిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్ బాబు, టిటిడి పాలకమండలి సభ్యులు శాంతారామ్ విలేకర్ల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పురపాలక సంఘం అధ్యక్ష పదవి ఖాళీ అయిన నాటి నుండి తమ పార్టీ తరపున కౌన్సిలర్లుగా గెలుపొందిన జిమ్ దాము, సోము అధ్యక్ష పదవిని ఆశించిన విషయం నిజమేనని, అయినా అధినాయకుల ఆదేశానుసారం, పార్టీ క్రమశిక్షణను అనుసరిస్తూ 5వ వార్డు అభ్యర్థిని అధ్యక్షునిగా ఎన్నుకున్నట్టు తెలిపారు. గతంలో కుప్పం పురపాలక సంఘానికి జరిగిన ఎన్నికలలో అప్పటి అధికార వైసిపి ప్రభుత్వం ప్రభుత్వ వ్యవస్థలను అడ్డుపెట్టుకొని, దొంగ ఓట్లతో, దొడ్డిదారిన గెలుపొందినట్టు ఆరోపించారు. టిడిపిని ఆశ్రయించిన కౌన్సిలర్లు, టిడిపిలో గెలుపొందిన కౌన్సిలర్లు ప్రజాభీష్టం మేరకు జరిగిన పురపాలక సంఘం అధ్యక్ష ఉపఎన్నికలో పాల్గొని టిడిపి అభ్యర్థిని గెలిపించడం హర్షించదగ్గ విషయమన్నారు. ఎన్నికల తేదీని అధికారులు ప్రకటించిన నాటి నుండి టిడిపి అభ్యర్థి గెలిపించుకునే అంతవరకు శ్రమించిన టిడిపి కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. నూతన పురపాలక సంఘం అధ్యక్షులుగా ఎన్నుకోబడిన ఐదవ వార్డు కౌన్సిలర్ అభ్యర్థికి పురపాలక సంఘం తరపున కమిషనర్ శ్రీనివాసరావు శుభాకాంక్షలు తెలియజేశారు.

మున్సిపల్ అధ్యక్షులు సెల్వరాజును సన్మానిస్తున్న ఎమ్మెల్సీ శ్రీకాంత్, కమిషనర్ శ్రీనివాసరావు

మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్‌కు శుభాకాంక్షలు : ఎంపి

చిత్తూరు అర్బన్: కుప్పం మున్సిపల్ ఛైర్మన్ ఉపఎన్నికల్లో ఛైర్మన్‌గా ఎన్నికైన సెల్వరాజ్‌కు చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు సోమవారం ఢిల్లీ నుంచి శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ కోసం పనిచేసే వారికి తెలుగుదేశం పార్టీ సముచిత స్థానం కల్పించి, గౌరవిస్తుంది అనడానికి ఇదో నిదర్శనమన్నారు. సెల్వరాజ్ పార్టీ నాయకులు, ప్రభుత్వ అధికారులతో కలిసి కుప్పం పట్టణ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.

ఉప ఎన్నిక అప్రజాస్వామికం

విప్‌ను ధిక్కరించిన వారిని సస్పెండ్ చేయాలి: ఎమ్మెల్సీ భరత్

కుప్పం రూరల్: మండల అభివృద్ధి కార్యాలయంలో సోమవారం జరిగిన పురపాలక సంఘం అధ్యక్ష ఉపఎన్నికల అప్రజాస్వామికమని ఎమ్మెల్సీ భరత్ ఆరోపించారు. 2021లో జరిగిన కుప్పం పురపాలక సంఘం ఎన్నికలలో 19 మంది వైసిపి అభ్యర్థులు గెలుపొందగా, టిడిపి కేవలం 6 స్థానాలకే మిగిలిపోవడం తెలిసిందేనన్నారు. రాష్ట్రంలో టిడిపి అధికారం చేపట్టిన అనంతరం పురపాలక సంఘం అధ్యక్షులుగా కొనసాగిన డాక్టర్ సుధీర్ తన అధ్యక్ష పదవితో పాటు కౌన్సిలర్ పదవికి సైతం రాజీనామా చేయడం జరిగిందని, ఆనాటి నుండి కుప్పం పురపాలక సంఘం అధ్యక్ష పదవి ఖాళీగా ఉండటంతో సోమవారం అధ్యక్ష ఉపఎన్నిక నిర్వహించడం జరిగిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పంలో జరిగిన ఎన్నిక ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా ఉందని, వైసిపి అభ్యర్థులను ప్రలోభాలకు గురిచేసి టిడిపిలో చేర్చుకోవడం జరిగిందన్నారు. వైసీపీలో గెలిచి, పార్టీ విప్‌ను ధిక్కరించిన పది మంది కౌన్సిలర్లను పార్టీ నుండి తొలగించాల్సిందిగా జిల్లా వైసీపీ అధ్యక్షులకు సిఫారసు చేసినట్టు తెలిపారు. ఇందులో ఒకటవ వార్డు కౌన్సిలర్ జగదీష్, 3వ వార్డు కౌన్సిలర్ అరవింద్, 4వ వార్డు రాజమ్మ, 8వ వార్డు చంద్రమ్మ, 13వ వార్డు హంస, 14వ వార్డు మునస్వామి, 15వ వార్డు తిలగవతి, 17వ వార్డు దేవకి, 21వ వార్డు లావణ్య, 24వ వార్డు కౌన్సిలర్ సయ్యద్ అలీ ఉన్నట్టు తెలిపారు.

పాత్రికేయులతో ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ భరత్

ఉపాధి కూలీలకు 'బీమా'

- ప్రధానమంత్రి సురక్ష యోజన ద్వారా చెల్లింపు
- మే ఒకటి నుండి వర్తించేలా చర్యలు...
- చిత్తూరు జిల్లాలో 2.69 లక్షల మందికి లబ్ధి

ప్రజాశక్తి- చిత్తూరు (యాదమరి):

గ్రామీణ ప్రాంతాల్లో వలసలు నివారణ కోసం కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం అమలు చేస్తోంది. దీని ద్వారా అధిక సంఖ్యలో పేదలు సొంత ఊర్లోని ఉపాధి పొందుతున్నారు. వేతనదారులు అనుకోకుండా మృత్యువాత పడితే ఆ కుటుంబం రోడ్డున పడాల్సిన పరిస్థితి. దీనితో వారికి బీమా సౌకర్యం కల్పిస్తుంది. దీన్ని అందరూ పొందేలా చర్యలు తీసుకుంటుంది. చిత్తూరు జిల్లాలో 31 మండలాలు ఉన్నాయి. అందులో 700 గ్రామపంచాయతీల్లో 2.69 లక్షల మంది ఉపాధి కూలీలకు బీమా వర్తించనుంది.

ఉపాధి హామీలో పనిచేసే కూలీలకు ప్రమాద బీమా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మే 1వ తేదీ నాటికి కూలీలందరికీ ప్రమాద బీమా చేయించాలని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ నిర్ణయించింది. ఉపాధి కూలీలు అనుకోకుండా ప్రమాదంలో చనిపోయినప్పుడు ఆ కుటుంబాలకు ఎలాంటి ఆర్థిక సాయం అందని పరిస్థితి ఏర్పడుతుంది. అలాంటి కుటుంబాలకు ఆసరాగా నిలిచేందుకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశంతో ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన ఇన్సూరెన్స్ ప్రీమియం తీసుకురావాలని నిర్ణయించారు. ఈ మేరకు గ్రామీణ అభివృద్ధి, పంచాయతీరాజ్ ముఖ్యకార్యదర్శి ఆదేశాలు ఇచ్చారు. మే ఒకటవ తేదీ కల్లా కూలీల నుంచి దరఖాస్తు స్వీకరించి వాటిని బ్యాంకుల్లో నమోదు చేయించేలా ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదేశించారు. దీంతో చిత్తూరు జిల్లాలో ఉపాధి పీడీ రవికుమార్ జిల్లాలోని అన్ని మండలాల్లో ఏపీవోలు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లతో వారం క్రితమే టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన కింద ప్రీమియం ఒక వ్యక్తికి రూ.20లు చెల్లిస్తే చాలు ఆ వ్యక్తి అనుకొని సందర్భంలో ప్రమాదంలో చనిపోతే రూ.2లక్షలు బీమా లభిస్తుంది. అదేవిధంగా రాష్ట్రీయ స్వస్థ బీమా యోజన కింద రూ.450లు చెల్లిస్తే పలు రకాలు ప్రమాదాలకు బీమా లభిస్తుంది. ఈ రెండు పథకాల కింద ఉపాధి కూలీలకు నమోదు చేయాలని ఉపాధి అధికారులను ఆదేశించారు. మే ఒకటో తేదీ కల్లా ఉపాధి కూలీల నుంచి బీమా దరఖాస్తు ఫారాల్లో సంతకాలు తీసుకొని బ్యాంకులో కెళ్ళి నమోదు చేయాలని సూచించారు.

> ఉపాధి కూలీలకు అండగా నిలిచేందుకు రెండు బీమా పథకాలు అందుబాటులోకి తీసుకువచ్చింది కేంద్ర ప్రభుత్వం. మొదటిది పీఎం సురక్ష బీమా యోజన, దీనికి 18 నుంచి 70 సంవత్సరాల వయసు కలిగిన వారు అర్హులు. వీరు ఏటా రూ.20లు చెల్లిస్తే ఈ పథకంలో ప్రయోజనాలు పొందవచ్చు. ప్రమాదవశాత్తు మరణిస్తే కుటుంబానికి రూ.2లక్షలు చెల్లిస్తారు. ఉపాధి జాబ్ కార్డులు ఎంతమందికి ఉంటే అంతమందికి ఈ బీమా వర్తిస్తుంది. రెండోది పీఎం జీవనజ్యోతి బీమా యోజన. ఇందులో ఏటా రూ.436లు చెల్లించాలి. 18 నుండి 50 సంవత్సరాల వయసు వారు అర్హులు. కేవలం ఇంటి పెద్దకు మాత్రమే బీమా పొందే వీలుంటుంది. సహజ మరణమైన, ప్రమాదవశాత్తు మరణమైనా రూ.2లక్షలు మృతుని కుటుంబానికి అందిస్తారు.

కూలీలందరికీ బీమా సౌకర్యం కల్పించాలి

సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు

జిల్లాలో ఉపాధి హామీ చట్టంలో పనిచేస్తున్న జాబ్ కార్డుదారులకు అందరికీ ప్రధాని మంత్రి యోజన పథకం కింద బీమా సౌకర్యం కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్న కిందిస్థాయిలో రాజకీయాలకతీతంగా బీమా చేయాలి. జిల్లాలో ఇప్పటికే ఉపాధిలో ఉన్న సౌకర్యాలు ఏవి కూడా కల్పించకపోవడంతో కూలీలు ఇబ్బంది పడుతున్న పరిస్థితి ఉంది. వేసవిలో కూలీలకు అందించాల్సిన సౌకర్యాలను అందించాలి.

జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి బీమా

ఆవసాని రవికుమార్, చిత్తూరు జిల్లా ఉపాధి పథక సంచాలకులు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ కార్యదర్శి ఆదేశాల మేరకు చిత్తూరు జిల్లాలోని ఉపాధి కార్డు కలిగిన ప్రతి ఒకరికి బీమా పథకాలు 100శాతం నమోదు చేసేలా మండల స్థాయిలోని ఉపాధి అధికారులకు సిబ్బందికి ఆదేశాలు ఇచ్చాం. ఫీల్డ్ అసిస్టెంట్లు, క్షేత్రస్థాయి సిబ్బంది ఉపాధి కూలీల నుంచి దరఖాస్తులు తీసుకొని బ్యాంకుల వద్దకెళ్లి ఆన్లైన్లో నమోదు చేస్తారు. మే ఒకటో తేదీ నుండి బీమా వర్తించేలా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం.

ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికకు 436 వినతులు

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు మున్సిపల్ కౌన్సిల్ సమావేశపు మందిరంలో పలమనేరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని ప్రజల సమస్యల పరిష్కారం నిమిత్తం ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక సోమవారం జరిగింది. పలమనేరు ఎమ్మెల్యే ఎన్.అమర నాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా జాయింట్ కలెక్టర్ జి. విద్యాధరి, డిఆర్ఓ కె.మోహన్ కుమార్, ఆర్‌డీవో భవాని పాల్గొని ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 436 వినతులు ప్రజల నుంచి అందినట్లు కలెక్టర్ తెలిపారు. అలాగే గత వారం అందిన 428 అర్జీల పరిష్కారంపై సమీక్షించారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను జిల్లా అధికారులు, మండలస్థాయి అధికారులకు త్వరగా సమస్యలు పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ నరేంద్ర పాడల్, జెడ్పీ సీఈఓ రవికుమార్ నాయుడు, పిఆర్ఎస్ఈ చంద్ర శేఖర్ రెడ్డి, డ్వామా పిడి రవికుమార్, డిపిఓ సుధాకర్ రావు, ఆర్‌డిఎస్, ఐసిడిఎస్ పీడీలు శ్రీదేవి, వెంకటేశ్వరి, ఏపీ ఎస్‌పిడిసిఎల్ ఎస్ఈ ఇస్మాయిల్ పాల్గొన్నారు.

కలగా మారిన సొంత ఇళ్లు

- ఇండ్ల నిర్మాణాలకు కుంటి సాకులు
- పూరిపాకలోనే నిరుపేదల బతుకులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- ప్రభుత్వం న్యాయం చేయాలంటున్న బాధితులు

నిరుపేదలకు పక్కా గృహాలు, పూరి పాకలు లేని సమాజాన్ని నిర్మాద్దాం, ప్రతి పేదవాడికి పక్కా ఇళ్లు నిర్మాణమే మా అజెండా అంటూ గత 20 సంవత్సరాలుగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు ఊకదంపుడు ఉపన్యాసాలతో కాలాన్ని వెళ్ళబుచ్చుతున్నారు తప్ప క్షేత్రస్థాయిలో పేదవాడికి పక్కా ఇళ్లు కట్టించిన పాపాన పోలేదు. వాస్తవ పరిస్థితులను చూస్తే మండలంలోని ఉడమలకుర్తి గ్రామపంచాయతీ పీవీపురం దళితవాడలో దాదాపు 80శాతం నిరుపేదలు ఇప్పటికీ పూరిపాకల్లోనే అరాకొర సౌకర్యాలతో జీవనం సాగిస్తున్నారు. వానలు వస్తే తట్టాబుట్ట సర్దుకుని రక్షణ కోసం ప్రభుత్వ భవనాల వద్దకు పరుగులు తీస్తున్నారు.

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు నియోజకవర్గం ఎస్ఆర్ పురం మండలం ఉడమలకుర్తి గ్రామపంచాయతీ పివిపురం దళితవాడలో దాదాపు 70 కుటుంబాలు జీవన సాగిస్తున్నారు. వీరు ప్రధానంగా కూలి పనులు, వ్యవసాయ కూలీగా పనులు చేసుకుంటూ జీవన సాగిస్తున్నారు. ఈ గ్రామంలో ఎటు చూసినా కూలడానికి సిద్ధంగా ఉన్న పూరి పాకలే దర్శనమిస్తున్నాయి. ఏ ప్రభుత్వం వచ్చినా ఈ గ్రామస్తులకు పక్కా గృహాలు ఇప్పిస్తామని హామీలు ఇస్తూ నెరవేర్చకుండా కాలం వెళ్ళబుచ్చుతుంది. గ్రామంలో ఉన్న పాఠశాల, గ్రామస్తులు దాతల సాయంతో నిర్మించిన దేవాలయం తప్ప చెప్పుకోదగ్గ నిర్మాణాలు లేవు. దీన్ని బట్టి చూస్తే ప్రభుత్వం పేదలకు అమలు చేస్తున్న పథకాలు అమలు తీరుతెన్నులు స్పష్టంగా అర్థమవుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో పనిచేసిన ఓ వాలంటీరు సైతం పురిపాకలో ఉండడం గమనార్హం.

ప్రభుత్వాలు గృహ నిర్మాణాలకు అర్హులైన లబ్ధిదారులను గుర్తించి, వారితో దరఖాస్తులు చేయించి పేదల్లో ఆశలు చిగురించేలా చేస్తారు. పేదలు ఉంటున్న స్థలంలోని ఇంటిని తొలగించి కడగాలు వేస్తారు, హౌసింగ్ అధికారులు పరిశీలించిన అనంతరం లబ్ధిదారుల ఖాతాలో పరిశీలన కోసం ఒక రూపాయి వేస్తారు. తమకు కడగాళ్ల బిల్లులు ఈ ఖాతాలో జమవుతాయని అధికారులు చెబుతారు. అయితే ఆ రోజు నుంచి ఈరోజు వరకు ఖాతాలలో డబ్బులు పడితే ఇంటి నిర్మాణం చేపడుతామన్న పేదలు ఆశలు అడియాశలుగా మిగిలాయి. ఇంటి నిర్మాణం కోసం ఇటు హౌసింగ్ కార్యాలయానికి అటు బ్యాంకుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. అయినా ఎలాంటి ప్రయోజనం లేక పోండంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా పనులు ముందుకు సాగడం లేదు. సంవత్సరాలకు కొద్ది ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఆ గ్రామస్తులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు

గృహ నిర్మాణాలకు కుంటి సాకులు

ఈ గ్రామాల పక్కా గృహాలు అమలు కాకపోవడం గల కారణాలు గ్రామస్తులను విచారించగా వాళ్ళు చెప్పిన కారణాలు విస్మయానికి గురిచేస్తున్నాయి. తమకు గృహాలు మంజూరు చేస్తాను అని చెప్పిన అధికారులు ఎందుకు ఇళ్లు నిర్మించడం లేదంటే కుంటి సాకులు చెప్పినారని గ్రామస్తులు చెబుతున్నారు. స్థలాలు చూపే క్రమంలో అప్పటి అధికారులు కొందరికి స్థలాలు చూపలేదని, మరికొందరికి పునాదులు వేసుకున్న తర్వాత ఒక్క రూపాయి లబ్ధిదారుని అకౌంట్లో వేసి ఆపేశారని చెబుతున్నారు. అసలే కూలి చేస్తే కానీ ఇళ్లు గడవని పేదలైన తాము ఇళ్లు కట్టుకోలేకపోతున్నామని వాపోతున్నారు.

వర్షం పడితే పై కప్పు కారుతుంది..

- జి.సుబ్రమణ్యం, మాజీ సర్పంచ్ పివిపురం దళితవాడ

వర్షం పడిందంటే చాలు ఇల్లంతా నీళ్లే.. గాలివాన వస్తే పైకప్పు లేచిపోతుంది. చిన్నపాటి పూరిపాకలో భార్య పిల్లలతో సర్దుకోవడం చాలా కష్టంగా ఉంది. గత ప్రభుత్వంలో పక్కా గృహ నిర్మాణానికి ఇంటి స్థలం కేటాయిస్తామని చెప్పి కేటాయించలేదు. మా గ్రామంలో విచారించి మాకు ఇళ్ల స్థలాలు కేటాయించండి. ఇంటి స్థలం కేటాయించి ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోవాలి.

ఒక్క రూపాయి.. శాపంలా మారింది

ఎస్.చెంగమ్మ, గృహిణి

గత ప్రభుత్వంలో పక్కా గృహ నిర్మాణానికి లిస్టులో నా పేరు వచ్చింది. కానీ అప్పటి ప్రభుత్వం గృహ నిర్మాణాని కోసం పునాదులు కూడా తోవ్వలేదు. మా ఖాతాలో రూపాయి వేయడంతో పక్క గృహనిర్మాణానికి అర్హులు కారని అధికారులు తెలిపారు. ప్రభుత్వం సహకరించి మాకు పక్క ఇళ్లు ఏర్పాటు చేస్తే బాగుంటుంది. పూరిపాకలో గాలివానకు అవస్థలు పడుతున్నాం.

స్థలం ఇస్తే ఇల్లు కట్టుకుంటా..

- వి. జయరాజ్, పివి పురం దళితవాడ

అధికారులు ఒకసారి నా ఇంటిని పరిశీలించండి.. కనీసం ఇళ్ల స్థలం అయినా కేటాయిస్తే ఇళ్లు కట్టుకుంటా. నాకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. వారిని పోషించాలి, చదివించాలంటే రోజూ కూలి పనికి పోవాల్సిందే. దీనికి తోడు మాకు ఇంటి స్థలం లేదు, పక్కా ఇళ్లు లేదు. గత వారం కురిసిన ఆకాల వర్షానికి ఉన్న పై కప్పు సగం చిరిగిపోయింది. వర్షం వస్తే ఇలంతా వర్షపు నీళ్లే.. ముగ్గురు పిల్లలు, భార్యతో ఇలా అవస్థలు పడుతున్నాం. ప్రభుత్వం ఇకనైనా ఆదుకోవాలి.

ప్రజల నుంచి 9 వినతులు స్వీకరణ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: నగరపాలక కార్యాలయంలో సోమవారం ప్రజాఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమాన్ని నగర కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ నిర్వహించి ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజలు తెలిపిన సమస్యలపై అక్కడికక్కడే సంబంధిత అధికారులతో చర్చించారు. ప్రజాసమస్యలను పరిష్కరించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. పీజీఆర్ఎస్ కార్యక్రమంలో అందే వినతులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో విచారించి పరిష్కరించాలని, సంబంధిత నివేదికలను సకాలంలో సమర్పించాలని ఆదేశించారు. సోమవారం నాటి కార్యక్రమంలో ఇంజనీరింగ్ 4, రెవెన్యూ 3, పబ్లిక్ హెల్త్ 2 చొప్పున మొత్తం 9 వినతులు అందాయి. కార్యక్రమంలో ఎంహెచ్వో డాక్టర్ లోకేష్, ఎంఈ వెంకటరామి రెడ్డి, ఏసీపీ నాగేంద్ర పాల్గొన్నారు.

ప్రజాసమస్యలపై వినతులను స్వీకరిస్తున్న కమిషనర్

అలసత్వం చేయకండి: ఎస్పీ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: సోమవారం జరిగిన ప్రజాఫిర్యాదుల పరిష్కారం కార్యక్రమంలో ప్రజల నుంచి 41 ఫిర్యాదులు స్వీకరించినట్లు జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కారం కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్టప్రకారం విచారణ జరిపి, నిర్దేశించిన గడువులోగా ఫిర్యాదుదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. ప్రజలు తమ సమస్యలపై న్యాయం పొందేలా నిబద్ధతతో పని చేయాలన్నారు. ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకొని ప్రజలు న్యాయం పొందేలా చూడాలలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. పోలీసులు ప్రజలకు అందుబాటులో ఉండి, వారి సమస్యలను చట్టబద్ధంగా పరిష్కరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మొత్తం 41 ఫిర్యాదులు అందగా అందులో చీటింగ్ 3, కుటుంబ తగాదాలు 8, వేధింపులు 6, ఇంటి తగాదాలు 1, భూ తగాదాలు 12, డబ్బు తగాదాలు 8, చిన్నపాటి గొడవలు 1, దారి సమస్యలు 1, ఆస్తి తగాదాలు 1 ఉన్నాయి.

ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ

సమస్యలు పరిష్కరించండి..
సాయి గార్డెన్ సిటీ వాసుల వినతి

వినతిపత్రాలు అందిస్తున్న గంగవరం సాయిగార్డెన్ సిటీ ప్రజలు

ప్రజాశక్తి -గంగవరం: గంగవరం మండల కేంద్రం, సాయి గార్డెన్ సిటీలో నెలకొన్న సమస్యలపై కలెక్టర్ సుమిత్ కుమార్‌కు, పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డికి సాయి గార్డెన్ సిటీ కమిటీ తరపున పలు వినతి పత్రాలు అందించారు. సోమవారం పలమనేరులో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల వేదికలో వారు ఈ మేరకు వినతి పత్రాలు అందించారు. ఈ సందర్భంగా సాయి గార్డెన్ సిటీ వాసులు మాట్లాడుతూ రోడ్లు అధ్వానంగా వున్నాయని, కల్వర్టుల సమస్య, డ్రైనేజీ, పారిశుధ్యం, వీధిలైట్ల సమస్య, విద్యుత్ సరఫరాలో అంత రాయం ఏర్పడుతోందని కలెక్టర్‌కు వివరించారు. నూతన ట్రాన్స్ ఫార్మర్, డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని వినతి పత్రాలు అందించారు. తమ నివాస ప్రాంతం 2007 నుంచి ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదని, ప్రభుత్వానికి లక్షల రూపాయల పన్ను చెల్లిస్తున్నామని వెంటనే సమస్యలు పరిష్కరించాలని కోరారు. స్పందించిన కలెక్టర్, పలమనేరు ఎమ్మెల్యేలు సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సాయి గార్డెన్ సిటీ కమిటీ తరపున పల్లెరుచులు అమరనాథరెడ్డి, వివిరాజు, గుణశేఖరన్, దేవకుమార్, శ్రీకాంత్, శ్రీనివాసులు రెడ్డి, గజేంద్ర, సోమసుందర్ రెడ్డి, బాలకృష్ణ, రాజశేఖర్, రవీంద్ర రెడ్డి, విష్ణుప్రియ రాజు, దాము, దేవనాథ్ రెడ్డి, గోవిందప్ప కాలనీ వాసులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ కార్యదర్శిగా జి సురేష్ బాబు

జి సురేష్ బాబును సన్మానిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి -ఎస్ఆర్ పురం: పుత్తూరు కోర్టు బార్ అసోసియేషన్ కార్యదర్శిగా గాలి సురేష్ బాబు ఎన్నికయ్యారు. పుత్తూరు బార్ అసోసియేషన్ ఎన్నికలు సోమవారం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో కార్యదర్శిగా పోటీ చేసిన గాలి సురేష్ బాబు 22 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఈ సందర్భంగా గాలి సురేష్ బాబును ఎస్ఆర్ పురం మండలం పిల్లి గుండ్లపల్లి గ్రామానికి చెందిన మాజీ వాటర్ ఛైర్మన్ పి గుణశేఖర్ నాయుడు, లాయర్ జి పయని, లాయర్ బి రామచంద్రారెడ్డి, కుప్పయ్య , త్యాగ దుశ్శాలువాలతో సన్మానిం చారు. గాలి సురేష్ బాబు వెదురుకుప్పం మండలం, పాతగుంట పంచాయతీ, చెనుగారపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి కావడంతో పలువురు ఆయనను అభినందించారు.

టిడిపి ఎన్నికలు ఏకగ్రీవం

ఎన్నికైన వారిని సన్మానిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి - బైరెడ్డిపల్లి: మండలంలో సంస్థాగత ఎన్నికల్లో భాగంగా బైరెడ్డిపల్లి మండలం గొల్ల చీమనపల్లి పంచాయతీ అధ్యక్షుడిగా అమరనాథ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సుబ్రహ్మణ్యం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలోని పెద్ద చెల్లారుగుంట పంచాయతీ అధ్యక్షుడిగా జయచంద్ర ప్రకాష్, ప్రధాన కార్యదర్శిగా సిఈశ్వర్ రెడ్డి, మండల టిడిపి అధ్యక్షులు బి ఎమ్ కిషోర్ , ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం శెట్టి ఆధ్వర్యంలో ఏకగ్రీవ ఎన్నికల నిర్వహించారు. ఎన్నికైన వారికి దుశ్శాలువా కప్పి పూలమాల వేసి ఘన సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా పంచాయతీలలోని టిడిపి కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు స్మార్ట్ ఫోన్లు పంపిణీ

విభిన్న ప్రతిభావంతులకు స్మార్ట్ ఫోన్లు అందిస్తున్న జెసి విద్యాధరి

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: చిత్తూరు జిల్లాలోని బధిరులైన విభిన్న ప్రతిభావంతులకు (మూగ, చెవిటి) వారికీ జిల్లా జాయింట్ కలెక్టర్ జి విద్యాధరి స్మార్ట్ ఫోన్‌లు అందించారు. సోమవారం సాయంత్రం జిల్లా సచివాలయంలోని జిల్లా జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో మేనేజింగ్ డైరెక్టర్, ఏ పి డి ఏ ఎస్ సి ఏ సి విజయవాడ వారి సాయంతో 4లక్షలా 50వేల రూపాయలతో 30 టచ్ ఫోన్లను (ఒక టచ్ ఫోన్ రూ. 15,000లు) జాయింట్ కలెక్టర్ చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ నరేంద్ర పాడల్, విభిన్న ప్రతిభా వంతుల , వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడి ఏ వై శ్రీనివాసులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపి సీనియర్ నాయకుడు మృతి

విజి చంద్రశేఖర్ (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: మొగిలి వెంకటగిరి గ్రామానికి చెందిన విజి చంద్రశేఖర్ (కవి) అనారోగ్య సమస్యలతో సోమవారం మృతి చెందారు. ఈయన గతంలో టిడిపి మండలం మాజీ ప్రధాన కార్యదర్శిగా విధులు చేపట్టి టిడిపికి సేవలు చేశారు ఆయన మరణం టిడిపికి తీరని లోటు అని పేర్కొన్నారు. వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ఇవ్వాలని కోరుకుంటున్నామన్నారు.

వసతుల లేమి!

- కనిపించని మౌలిక వసతులు
- అసంపూర్తిగా పనులు
- ప్రమాదకరంగా జారుడు బండ
- నగరవనం అభివృద్ధిని పట్టించుకునే వారేరి..?

ప్రజాశక్తి-కార్వేటినగరం: ఆహ్లాదకర వాతావరణంలో ప్రజలకు సేద తీరడానికి, సెమీ పర్యాటక కేంద్రంగా కార్వేటినగరం వనం ఏర్పాటు చేశారు. ఏర్పాటు వరకు బాగానే ఉన్నా.. ఆ తర్వాత కల్పించాల్సిన మౌలిక వసతులు కల్పించ లేదు. చేపట్టిన పనులు సైతం అసంపూర్తిగా దర్శమిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆదమరచి జారుడుబండ ప్రమాదకరంగా మారిందని, ఆద మరిచి జారితే ప్రమాదం పొంచి వుందని పర్యాటకులు వాపోతున్నారు. కారణం.. జారుడు బండ కింద సన్న ఇసుక ఉండాల్సిన మోతాదులో వుండాల్సిన ప్రాంతాల్లో లేదు.. అంతే కాకుండా ఉండే ఇసుక సైతం గండు ఇసుకతో నింపడం వల్ల జారిపడితే గాయాల పాలైన సంఘటనలు కూడా అనేకం వున్నాయి. ఈ నగరవనం పురోగతిని పట్టించుకునే నాథుడే కరువయ్యారని పర్యాటకులు అసహనం వ్యక్తం చేశారు.

అసంపూర్తిగా పనులు

కార్వేటినగరం సంస్థానాధీశుల కాలం నాటి నుంచి పర్యాటక కేంద్రంగా విరాజిల్లింది. అయితే ఆహ్లాదకరమైన వాతావరణంలో వనం ఏర్పాటు చేయాలనే సదుద్దేశంతో వైసిపి ప్రభుత్వంలో అప్పటి ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి చొరవతో కార్వేటినగరవనంకి అనుమతులు వచ్చాయి. కేంద్ర ప్రభుత్వం నుంచి రూ. 1.80 కోట్లు నిధులు విడుదలయ్యాయి. ఈ నిధులతో వనం అభివృద్ధి చేయాల్సి ఉండగా తూతూ మంత్రంగా పనులు సాగించి అసంపూర్తిగా వదిలివేసి మౌనంగా వుండిపోయారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

నగరవనం అభివృద్ధిని పట్టించుకునే వారేరి..?

కార్వేటినగర వనంలో పర్యాటకులను ఆకటుకునేలా బోటు షికారు, విశ్రాంతి భవనం, చిన్న పిల్లలు ఆడుకునేందుకు జారుడు బండ, ఉయ్యాలు, ఇలా పిల్లలను ఆకట్టుకునే విధంగా ఏర్పాట్లు చేయాల్సి వుంది. యువకులకు అనుకూలంగా జిమ్, వాకర్స్‌కు వాకింగ్ ట్రాక్ వంటివి ఏర్పాటు చేయాలనే ముఖ్యఉద్దేశంతో నగరవనం ఏర్పాటు చేశారు. అయితే అన్ని అరకొరగా ప్రభుత్వ ఆలోచనలకు విరుద్ధంగా దర్శనమిస్తూ అభివృద్ధికి ఆమడదూరంలో వుంది.

కార్వేటినగరం- పుత్తూరు రహదారిపై ఏర్పాటు చేసిన నగర వనం

పార్కింగ్ ఏర్పాట్ల జాడెక్కడ?

నగరవనం వద్ద పర్యాటకుల వాహనాల పార్కింగ్‌కు ఏర్పాట్లు చేపట్టి ప్రత్యేక స్థలాన్ని కేటాయించాలి. కానీ నగరవనం వద్ద పార్కింగ్ చేయడానికి అనువైన స్థలాన్ని కేటాయించక పోగా అక్కడ పార్కింగ్ బోర్డు ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు. పార్కింగ్ బోర్డు ఉన్న ప్రాంతంలో స్థలాన్ని చదును చేయలేదు. అక్కడ పిచ్చి మొక్కలు దర్శనమిస్తున్నాయి.

ప్రమాదకరంగా మారిన జారుడు బండ

ప్రమాదకరంగా ఫ్లోటింగ్ బ్రిడ్జి


ప్రమాదకరంగా ఫ్లోటింగ్ బ్రిడ్జి

సందర్శకులను ఆకట్టుకునే విధంగా కుప్పానిగుంటలో ఏర్పాటు చేసిన ఫ్లోటింగ్ బ్రిడ్జి ప్రస్తుతం ప్రమాదకరంగా వుంది. ఫ్లోటింగ్ బ్రిడ్జికి నియమ నిబంధనల ప్రకారం ఉండాల్సిన రోప్‌లు కూడా లేక పోవడంతో పర్యాటకులు అందులో దిగేందుకు భయభ్రాంతులకు గురవుతున్నారు. బోటుకు మూడు రోప్‌లు ఉండాల్సి ఉండగా ఒక్కటే ఏర్పాటు చేయడంతో ప్రమాదం పొంచి ఉందని పిల్లల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఎంతో దూరదృష్టితో గత రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన కార్వేటి నగరవనంలో ఉన్న అసంపూర్తి పనులను పూర్తి చేసి పర్యాటకులకు పూర్తి స్థాయిలో కార్వేటినగర వనంని అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

బోర్డుకే పరిమితమైన వాహనాల పార్కింగ్ స్థలం

కనీస వేతనం ఇవ్వండి
కలెక్టరేట్ ఎదుట మధ్యాహ్న భోజన కార్మికుల నిరసన

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : మధ్యాహ్న భోజన కార్మికులకు, స్కూలు స్వీపర్లకు కనీసం 18 వేల రూపాయలు జీతం ఇవ్వాలని, పిల్లల భోజనం ఖర్చు 15 రూపాయలకు పెంచాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ సురేంద్రనాథ్ డిమాండ్ చేశారు. మిడ్ డే మీల్స్ వర్కర్ల, స్వీపర్ల సమస్యలు పరిష్కరించాలని చిత్తూరు కలెక్టర్ వద్ద కార్మికులలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు, స్కూల్ స్వీపర్లకు పెండింగ్ జీతాలు, బిల్లులు వెంటనే ఇవ్వాలని కోరారు. గత 22 సంవత్సరాల నుంచి ప్రభుత్వ పాఠశాలలలో మిడ్ డే మీల్స్ వర్కర్లుగా పనిచేస్తున్నారని పిల్లలకు నాణ్యమైన భోజనం వండి పెడుతున్నారని ఆయన తెలిపారు.

కలెక్టరేట్ ఎదుట కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల రిలే దీక్షలు

ఉద్యోగ భద్రత కల్పించండి
కలెక్టరేట్ ఎదుట ఎంహెచ్‌ఓల దీక్షలు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు సోమవారం నుండి జిల్లా కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహార దీక్షలకు పూనుకున్నారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు కల్పనా మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో వైద్య ఆరోగ్య సేవలను మెరుగుపరిచేలా ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ పేరిట కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లను నియమించడం జరిగిందన్నారు. ఆరు సంవత్సరాలకు పైగా పనిచేస్తున్న కనీస వేతనాలు అందడం లేదని 6 వేలు, 11 వేల రూపాయల జీతం ఇస్తూ ఇబ్బందుల గురి చేస్తున్నట్లు తెలిపారు. ఆయుష్మాన్ భారత్ నిబంధనల మేరకు ఆరు సంవత్సరాలు పనిచేసిన వారిని క్రమబద్ధీకరణ చేయాలని ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్న ఏమాత్రం పట్టించుకోవడంలేదని వాపోయారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన సవరణ జరపాలని అలాగే పని ఆధారిత ప్రోత్సాహాన్ని అందించాలని కోరారు. ఈపీఎఫ్‌ఓ పునరుద్ధరించాలని, క్లినిక్ అద్దెల బకాయిలను వెంటనే చెల్లించాలని, నిర్దిష్టమైన జాబ్‌చార్ట్ అమలు చేయాలన్నారు. ఎఫ్ఆర్ఎస్ నుండి సిహెచ్ వాళ్లకు మినహాయింపు, హెచ్ఆర్ పాలసీ, ఇంక్రిమెంట్, ట్రాన్స్ఫర్ అలవెన్స్, ఎక్స్‌గ్రేషియా, మెటర్నటీ సెలవులు ఇవ్వాలని కోరుతూ నిరవధిక సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన సమ్మెలో జిల్లా వ్యాప్తంగా సిహెచ్‌ఓలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకులు కీర్తి, అరుణ, దివ్య, సిహెచ్‌ఓలు పాల్గొన్నారు.

పెరుమాల్‌కుంట అన్యాక్రాంతం కాకుండా చూడాలి

తహశీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న మహిళలు

ప్రజాశక్తి -కార్వేటినగరం: సర్వే నిర్వహించి పెరుమాల్ కుంట ఆక్రమణకు గురి కాకుండా రక్షించాలని ఈడిగపల్లికి చెందిన మహిళలు మండల తహశీల్దారు నాగరాజుకు సోమ వారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గ్రామ మహిళలు మాట్లాడుతూ ఈడిగపల్లి గ్రామ సమీపంలో కొల్లకుంట లెక్కదాఖలాలో సర్వే నెంబర్ 308/1లో 50 సెంట్ల విస్తీర్ణంలో పెరుమాల్‌కుంట (ప్రభుత్వ భూమి) వుంది. కొంత మంది రైతులు ఈ కుంట పోరంబోకు భూమిని ఆక్రమించుకుంటున్నారని తెలిపారు. రోజురోజు కూ అన్యాక్రాంతం అవుతోందని తహశీల్దారు దృష్టికి తీసు కొచ్చామన్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి పెరుమాల్ కుంటను పూర్తి స్థాయిలో సర్వే నిర్వహించి ఆక్రమణను తొలగించి గ్రామస్తులకు అందుబాటులోని తీసుకురావాలని తహశీల్దారును కోరామని తెలిపారు. తహశీల్దారు సానుకూలంగా స్పందించారని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ మహిళలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలు పిల్లల భవిష్యత్తుకు పునాది

అంగన్‌వాడీ కేంద్రంలో వార్షిక దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి -వెదురుకుప్పం: అంగన్‌వాడీ కేంద్రాలు పిల్లల భవిష్యత్తుకు పునాది వంటివని సిడిపిఓ పద్మ సునంద పేర్కొన్నారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మండలం లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న పిల్లలకు సోమవారం వార్షిక దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సిడిపిఓ పద్మ సునంద మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల శారీరక, మానసిక, సాంస్కృతిక, భావోద్వేగ అభివృద్ధి పూర్తి స్థాయిలో వుందని వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాలు పిల్లల భవిష్యత్తుకు బంగారు పునాది వేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో సూపరు వైజరు భారతి, అంగన్‌వాడీ కార్యకర్తలు జయసుధ, విజయ్, కుమారి, నీరజ, చిరంజీవులు, అరుణకుమారి, పిల్లల తల్లిదండ్రులు, ఐసిడిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

కిశోర బాలికల భద్రతపై చైతన్యం తేవాలి: సీడీపీవో

మాట్లాడుతున్న సీడీపీవో వినతశ్రీ

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: కిశోర బాలికల భద్రతపై గ్రామాల్లో ప్రజలకు చైతన్యం తీసుకు రావాలని గంగాధర నెల్లూరు సిడిపిఓ వినతశ్రీ అన్నారు. గంగాధర నెల్లూరు ఐసిడిఎస్ కార్యా లయంలో సోమవారం కిశోర వికాసం కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ టీచర్లు, సచివాలయ మహిళా పోలీసులు, వివో లీడర్స్, విద్యాశాఖ సిఆర్‌పిలు, వెలుగు సీసీలకు సోమవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఓ మాట్లాడుతూ బాల్యవివాహాలు నిరోధించడానికి అన్ని శాఖల అధికారులు కలిసి సమన్వయంతో పని చేయాలన్నారు. కిశోర వికాస కార్యక్రమంతో బాలికల సాధికారతకు, వారి జీవితాలను మెరుగు పరచడానికి ఒక ముఖ్యమైన అడుగుగా నిలుస్తుందన్నారు. నేటి సమాజంలో తల్లిదండ్రు లకు బాలికల భద్రత రోజురోజుకీ సవాల్‌గా మారుతోందన్నారు. నేడు చాలా వరకు అన్ని పోటీ పరీక్షల్లో బాలికలదే పైచేయిగా ఉన్నప్పటికీ ఎంతో మంది కిశోర బాలికలు తమ కలలు నెరవేర్చుకోక ముందే బాల్య వివా హాలకు బలైపోతున్నారని, మరి కొంతమంది బాల కార్మికులుగా మారి పోతున్నారన్నారు. మరో వైపు బాలికలు లైంగిక వేధింపు లకు గురవుతు న్నారన్నారన్నారు. కొంతమంది తెలియని తనంతో ప్రేమ పేరిట ప్రలోభాలకు గురై నమ్మి మోసపోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని చెప్పారు. కిశోర వికాసం లాంటి మహోత్తర కార్యక్రమాన్ని అన్ని శాఖలు బాధ్యతగా తీసుకుని మన రేపటి పౌరులైన కిశోర బాలికలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై వుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపరువైజర్ బిందుమాలతి, సిహెచ్‌ఓ శ్రీనివాసులు, హెల్త్ సూపరు వైజర్ ధర్మేంద్ర, వెలుగు సీసీలు కోమల , వినూత, పోలీస్ ట్రైనర్ జయశ్రీ, సిఆర్‌పి గుణశేఖర్, సచివాలయ మహిళా పోలీసులు పాల్గొన్నారు.

తవణంపల్లి: తవణంపల్లి మండలంలో కిశోర వికాసం వర్క్‌షాప్‌ను నిర్వహించారు. 11 సంవత్సరాల నుండి 18 సంవత్సరాల లోపు అమ్మాయిలకు వేసవి సెలవుల క్యాలెండర్ 2025 అని, రుతుక్రమ పరిశుభ్రత, లింగ అసమానత, బలం హక్కులు, రక్షణ, విద్య కెరియర్ మార్గదర్శకత్వం, సైబర్, ఆన్లైన్ భద్రత, ఆర్థిక నిర్వహణ, కౌమార బాలికల నాయకత్వం సాధికారత, బాల్యవివాహాలు పై అనేక అంశాలపై గ్రామ సచివాలయాల స్థాయిలో క్యాలెండర్ సూచించిన తేదీలలో అవగాహన సదస్సులు నిర్వహించి తీసుకురావాలని సిడిపిఓ నిర్మల తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం రవికుమార్, లావణ్య సంఘమిత్రాలు ఏఎన్ఎంలు పాల్గొన్నారు.


తవణంపల్లిలో

'ఫ్యామిలీ డాక్టర్' సేవల తనిఖీ

104 సేవలను పరిశీలిస్తున్న వైద్యాధికారులు

ప్రజాశక్తి -యాదమరి: యాదమరి మండలంలోని గుట్ట కింద హరిజన వాడలో సోమవారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ 104 సేవలను ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ సుదర్శన్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైద్యం కోసం వచ్చే ప్రజలను మెరుగైన వైద్య సేవలు అందించాలని, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు ఒక రూపాయి కూడా ఖర్చు లేకుండా ఉచితంగా అన్ని రకాల వైద్య పరీక్షలు చేసి మందులు అందించేందుకే ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. ఈ విషయాన్ని సిబ్బంది గుర్తించుకొని ప్రతి ఒక్కరికి వైద్య సేవలు అందించాలన్నారు. ఆరోగ్యశ్రీ కింద ఐదు లక్షల రూపాయల వరకు ఆరోగ్యశ్రీ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి వైద్య సేవలు అందిస్తామన్నారు. ఈ విషయం ప్రజలకు తెలిపాలని డాక్టర్ సుదర్శన్ ఆదేశించారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు 104 సంచార వైద్య వాహనంలో ప్రజల అవసరాల మేర 14 రకాల వైద్య పరీక్షలు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ లక్ష్మీనారాయణ ,ఏఎన్ఎంలు,ఆశ వర్కర్స్ పాల్గొన్నారు.

డిసిసిబి ఛైర్మన్‌గా అమాస రాజశేఖర్ రెడ్డి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఛైర్మన్ పదవి మరోమారు అమాస రాజశేఖర్ రెడ్డి నే వరించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం అమాస రాజశేఖర్ రెడ్డిని చిత్తూరు సహకార కేంద్ర బ్యాంకు ఛైర్మన్‌గా నియమిస్తున్నట్లు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా సహకార కేంద్ర బ్యాంకుకు రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో అమాస రాజశేఖర్ రెడ్డి నియమితులయ్యారు . రాష్ట్ర విభజన అనంతరం నిర్వహించిన సాధారణ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చింది. తెలుగుదేశం పార్టీలోకి అమాస రాజశేఖర్ రెడ్డి చేరడంతో తిరిగి ఆయన్ని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఛైర్మన్గా నాటి తెలుగుదేశం పార్టీ నియమించింది. నాటినుండి తెలుగుదేశం పార్టీలోనే అమాస రాజశేఖర్ రెడ్డి కొనసాగుతున్నారు. గత వైకాపా ప్రభుత్వంలో మాజీ జడ్పీ ఛైర్మన్ గా పనిచేసిన రెడ్డమ్మను జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ఛైర్మన్ గా నియమితులయ్యారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఛైర్మన్ పదవి టిడిపి అగ్ర నాయకులు విశ్వ ప్రయత్నాలు చేసిన మాజీ డిసిసిబి ఛైర్మన్ అమాస రాజశేఖర్ రెడ్డి కి జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ఛైర్మన్ పదవి వరించింది.

విద్యతోనే ప్రగతి: సర్పంచ్

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: విద్యతోనే ప్రగతి సాధించ వచ్చని సర్పంచ్ కుప్పాల మురళి అన్నారు. మండలం లోని మంగళపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా పదో తరగతి ఫలితాల్లో జిల్లా మొదటి స్థానం సాధించిన విద్యార్థికి అభినందన సభ ప్రధానోపా ధ్యాయురాలు రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కుప్పాల మురళి మాట్లాడుతూ మంగళపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థిని ఏపీ హేమ పదిలో జిల్లా మొదటి స్థానం సాధించడం పాఠశాలకు, తమ గ్రామానికి గర్వ కారణమన్నారు. ఇక్కడ ఉపాధ్యాయులు నిబద్ధతతో పని చేస్తారని అభినందించారు. ఎస్ఎంసి ఛైర్మన్ రమేష్ బాబు మాట్లాడుతూ మండలంలో ప్రథమ స్థానం సాధించే తమ విద్యార్థులు పదవ తరగతి ఫలితాల్లో జిల్లా ప్రథమ స్థానం సాధించడమే కాక మండలంలో ప్రథమ , ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించడం మంగళపల్లి గ్రామానికి గర్వకారణం అన్నారు. మాజీ సర్పంచ్ భాస్కర్ నాయుడు మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో ఉత్తమ ఫలితాలు సాధిస్తోందనేందుకు ఈ సంవత్సరం ఫలితాలే నిదర్శనం అన్నారు. పాఠశాల పూర్వ విద్యార్థులు విశ్రాంత ఉపాధ్యాయులైన బిర్లా నాయుడు, మోహన్ రాజ్ మాట్లాడుతూ తమ గ్రామ పాఠశాలలోని విద్యార్థులు సాధిస్తున్న ప్రగతి ఎంతో గర్వకారణమని విద్యార్థులను అభినందిస్తున్నామన్నారు. భవిష్యత్తులో పాఠశాల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రధానోపా ధ్యాయులు, సర్పంచ్, ఎస్ఎంసి ఛైర్మన్ రమేష్ బాబు, భాస్కర్ నాయుడులు హేమ (592), పునీత్ సాయి , హిమ (555), చాణిక్య(584), కౌశిక్ (529) మార్కులు సాధించిన వారికి బహుమతులు ఇచ్చి సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థులు మనోరంజని, మోహన్ నాయుడు విద్యార్థులను అభినందిస్తూ గ్రామస్తుల సహకారంతో పరిసర ప్రాంతంలోని ప్రతి గ్రామంలో విద్యార్థుల ప్రగతిని డిజిటల్ బ్యానర్స్‌తో ప్రదర్శిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సంజీవి ,అరుణ శివప్రసాద్, సంపంగి ,పిల్లారప్ప, ప్రేమ కృష్ణ, భారతి, మోహన్ రెడ్డి, శ్రీనివాసులు ,ధన శేఖర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

క్వారీ పేలుళ్లతో భయం..భయం..!

- అధిక మోతాదులో నల్లమందు వినియోగం - రెవెన్యూ అధికారుల పర్యవేక్షణ కరువు - చాలా ఏళ్లుగా స్థానికులను పీడిస్తున్న సమస్య

ప్రజాశక్తి -వెదురుకుప్పం: తెల్లరాయి క్వారీ యజమానులు నిబంధనల ప్రకారం నిర్వహిస్తా మని అధికారుల దగ్గర అనుమతులు తీసుకొని ఆపై ఉల్లంఘించడం పరిపాటిగా మారింది. కొందరు నిర్వాహకులు నిబంధనలు పాటించ కుండా ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు. పట్టించుకోవాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమని బతకాల్సిన పరిస్థితి ఎదురైంది.

మండలంలోని క్వారీ యజమానులు ఒకరు ఇద్దరు తప్ప మిగిలినవారికి బ్లాస్టింగ్ కు అనుమతులు లేవు. ఇష్టానుసారంగా పేలుళ్లు జరుగుతున్నా వారిపై చర్యలు శూన్యమే.. ఈ సమస్య మండల వాసులను, అధికారులకు వేధిస్తున్న ప్రశ్న. మండల పరిధిలో ఒక క్వారీకి అధిక మోతాదులో బ్లాస్టింగ్‌కు జెలెటిన్ స్టిక్స్ వినియోగిస్తున్నారని స్థానికుల వాపోతున్నారు. మండలంలో సుమారు ఐదు తెల్ల రాయి కంకరు క్వారీల్లో రెండింటికి మాత్రమే అనుమతులు ఉన్నట్లు సమాచారం. నిబంధనలను పట్టించుకోకుండా ఇష్టానుసారంగా క్వారీ యజమానులు పేలుళ్లు నిర్వహిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. మాంబేడు పంచాయతీల్లో గోపగుండ్లు సమీపంలో చిన్నూరు తిప్ప దగ్గర ఒక క్వారీ వుంది. పచ్చికాపల్లం పంచాయతీ ఎర్రగుంట కాలింగ్ మధ్యలో ఒక క్వారీ నడుస్తోంది. బంధార్లపల్లి సమీపంలో రెండు క్వారీలు వున్నాయి. సంతబైలు పంచాయతీ ఓట్ల దగ్గర తెల్ల రాయి గచ్చు క్వారీలు ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు.

అధికారుల పర్యవేక్షణ కరువు

ఈ క్వారీలలో మోతాదులకు మించి నల్లమందు వాడుతున్నారని ప్రచారం సాగుతోంది. స్థానికంగా ఉన్న రైతులు పొలాల్లో ఈ తెల్ల రాయి దిమ్మెలు ఎగసిపడుతున్నట్లు సమీప రైతులు చెబుతున్నారు. సమీపంలో ఉన్న భూములను రైతులు ఈ క్వారీ పేలుళ్ల భయానికి భయపడి భూములను బీడుగా వదిలేశారు. ఈ సమస్యను రైతులు గతంలో రెవెన్యూ అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని వాపోతున్నారు. ఈ క్వారీల వైపు రెవెన్యూ వారు తనిఖీలు చేసిన పాపాన పోలేదని గ్రామస్తులు చెబుతున్నారు. రెవెన్యూ అధికారులు నిజాలను పరిశీలించి క్వారీలపై చర్యలు తీసుకునిపేలుళ్లను నిరోధించి రైతులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

6 గంటలు అయితే భయం భయం

మాంబేడు పంచాయతీ గూబగుండ్ల సమీపంలో తిన్నూరుతిప్ప సమీపంలో ఉన్న క్వారీలో రోజూ బ్లాస్టింగ్ ఆరు గంటల సమయంలో నిర్వహిస్తారు. ఆ సమయంలో గుట్టపై నుంచి కిందకు తెల్ల రాయి దిమ్మలు ఎగిసి పడుతాయి. చుట్టుపక్కల పొలాల్లో ఉన్న రైతులు భయంతో అటువైపుగా ఎవరూ వెళ్లరు. పొలాలను బీడుగా వదిలేశారు. పశువులు, మేకలు, గొర్రెలు మేపే రైతులు అయితే అటువైపు పోవాలంటే భయాందోళనకు గురవుతున్నారు. తెల్ల రాయి దిమ్మలు పడి మూగజీవాలు, అటవీ జంతువులు బలైన సంఘటనలు ఎన్నో ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు.

పై అధికారులకు నివేదిక అందిస్తాం

మండలంలో ఉన్న క్వారీలను పరిశీలించి పై స్థాయి అధికారులకు నివేదిక పంపిస్తాం.. నివేదిక వచ్చిన తరువాత చట్ట పరమైన చర్యలు తీసుకుంటాం..

- కె బాబు, తహశీల్దారు, వెదురుకుప్పం.

IN THE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE (JUNIOR DIVISION), CHITTOOR
I.A.NO. 227 OF 2025
O.S.NO. OF 2025

Between
The Villagers of Pathapalyam gram Panchayath Rep., by A.P.Sankara ......Petitioner/Plaintiff
And:
J.Venkatesulu Naidu and another ......Respondents/ Defendants

GENERAL NOTICE TO PUBLIC

It is here by brought to the notice of the Villagers of Pathapalyam gram Panchayath that J.Venkatesulu Naidu and another encroached upon the schedule property hereunder mentioned which is communal property meant for public A.P.Sankara, resident of Pathapalyam filed above suit against J.Venkatesulu Naidu and another over the schedule property to protect the common interests of the villagers of Pathapalyam Gram Panchayath in representative capacity on behalf of the above village. The above case posted to 06-05-2025 by intimating to general public by way of paper publication about the objection if any by the villagers in filing above suit by A.P.Sankara on behalf of villagers of Pathapalyam Gram Panchayath. If any villager have any objections in filing above suit by A.P.Sankara in representative capacity on behalf of the Villagers of Pathapalyam Gram Panchayath, please be present in person or through advocate on **06-05-2025 at about 10-30 A.M** in the above court and raise objections on the above aspect.

PLAINT 'A' SCHEDULE

Chittoor District - Chittoor Sub District G.D.Nellore Mandal Pathapalyam Revenue Village Accounts - Properties at Mittakthur Village:
1. S.No.57 - Sircar Dray - To an extent of Ac.0.18 cents
2. S.No.58 Sircar Dry - To an extent of Ac.0.13 cents
In which illegally laid bore well, illegal structures like stone reventment, Starter Shed with cut stones and plantation etc., within the following boundaries:
East: Vanka, West: Vanka, North :Lands of 1st defendant
South:Lands of Rama Mandadi @ Kutti Mandadi
3. S.No.90 Sircar Dry - To an extent of Ac.0.10 cents out of Ac.0.55 cents 4. S.No.89 Sircar Dry - To an extent of Ac.0.15 cents out of Ac.0.66 cents Nos.3 and 4 are within the following boundaries:
East :Burrial Ground, West: Vanka, North: C.C.Road
South: Lands of Daivamma and Burrial ground

PLAINT 'B' SCHEDULE

Chittoor District - Chittoor Sub District G.D.Nellore Mandal Burial ground at Mittakthur Pathapalyam Revenue Village Accounts Village - S.No.88 - Sircar Dry - To an extent of Ac.0.50 cents out of Ac.2.71 cents within the following boundaries:
East: Remaining Burrial ground West: Lands of Daivamma
North:Lands of Daivamma,South: Lands of M.Venkatesulu Naidu S/o M.Bhakthavaksala Naidu.

(B.O.)

Sd/- **C.K.RAGHU,** Advocate for Petitioners